
దొండపాడు పోలింగ్ కేంద్రం వద్ద ఓటేసేందుకు బారులు తీరిన మహిళలు


వలివర్తిపాడులో ఓటు హక్కు వినియోగించుకునేందుకు క్యూలో నిలబడిన ఓటర్లు


మొవ్వ మండలం కోసూరులో జోరు వానలో పోలింగ్ బూత్‌కు ఓటు వేసేందుకు వస్తున్న ఓటర్లు


మొవ్వలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కైలే అనిల్‌కుమార్

క్లుప్తంగా

మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకుంటారు



గుడివాడ టౌన్: తమ భవిష్యత్‌ను నిర్ణయించే ఈ ఎన్నికల్లో మహిళలు, వృద్ధులు, యువత మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు ఓటు వేశారని భావిస్తున్నట్లు గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. సోమవారం ఓటు వేసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదలందరికీ మంచి జరిగిందన్నారు. లబ్ధిదారులు ఎక్కువ మంది మహిళలు ఉన్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి అయితే తమ పిల్లల భవిష్యత్ బాగుంటుందని మహిళలు అనుకుంటున్నారన్నారు. సీఎం జగన్ పేదవాళ్లను పట్టించుకునే ప్రభుత్వం నడిపారన్నారు. పేదవారికి సొంతింటి కల నెరవేర్చి, వారికి మెరుగైన ఆరోగ్యం అందించేందుకు కృషిచేసిన జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజలు తిరిగి ఆశీర్వదిస్తారని పేర్కొన్నారు. మహిళలు పెద్ద ఎత్తున పోలింగ్‌లో పాల్గొనడమే ఇందుకు నిదర్శనమన్నారు.

కొండలమ్మను దర్శించుకున్న కొడాలి నాని



గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారిని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) సోమవారం దర్శించుకున్నారు. తొలుత ఆయనకు ఆలయ చైర్మన్ శేషం గోపి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆయన పేరిట అమ్మవారికి వేద పండితులు ప్రత్యేక పూజలను ఒనరించారు. అమ్మవారి చిత్రపటంతో పాటు లడ్డూ ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాలేటి చంటి, శాయన రవి, పెన్నేరు ప్రభాకరరావు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడి సన్నిధిలో డైరెక్టర్ వైవీఎస్ చౌదరి



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని తెలుగు సినీ దర్శకుడు వైవీఎస్ చౌదరి సోమవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఉదయం ఆలయానికి విచ్చేసిన వీరు తొలుత ఆలయ ప్రదక్షిణ నిర్వహించి, నాగపుట్టలో పాలు పోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు.

గుడివాడలో ఓటేసిన ప్రముఖులు


కుటుంబ సభ్యులతో కలసి ఓటువేసిన న్యాయమూర్తి బట్టు దేవానంద్



గుడివాడ టౌన్: సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పట్టణ ప్రముఖులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) స్థానిక రాజేంద్రనగర్/లోని ఎస్‌జీఆర్‌కే గవర్నమెంట్ హైస్కూల్లో తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటుహక్కు వినియోగించుకున్నారు. గుడివాడకు చెందిన మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి బట్టు దేవానంద్ స్థానిక స్లేటర్ పేటలోని మున్సిపల్ ప్రైమరీ స్కూల్లో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన వద్దాది గోవిందరావు(రాజేష్) స్థానిక గౌరీశంకరపురంలోని మున్సిపల్ ప్రైమరీ పాఠశాలలో తన ఓటుహక్కును వినియోగించుకున్నారు.

ఆస్పత్రి నుంచి పోలింగ్ బూత్‌కు..

గుడివాడ టౌన్: అనారోగ్యంతో బాధపడుతూ కూడా భారత పౌరుడిగా తన బాధ్యతను నిర్వర్తించేందుకు ఆస్పత్రి నుంచి వైద్యులతో సహా పోలింగ్ కేంద్రానికి వచ్చి తన ఓటును వినియోగించుకున్న వ్యక్తి సహచర ఓటర్లను ఆశ్చర్యానికి గురిచేసింది. స్థానిక ఏజీకే మున్సిపల్ హైస్కూల్లో పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ వ్యక్తి తన ఓటుహక్కును వినియోగించుకుని ఆదర్శంగా నిలిచారు.

ఓటెత్తిన చైతన్యం


పమిడిముక్కల మండలం కపిలేశ్వరపురంలో ఓటు వేసేందుకు వస్తున్న వృద్ధులు

గుడివాడ, పామర్రు, కైకలూరు నియోజకవర్గాల్లో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోటెత్తారు. యువకులు, వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు సోమవారం ఉదయం 6.30 గంటలకే పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకున్నారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలోనూ ఓటర్లు ఎండవేడిమిని కూడా లెక్క చేయకుండా క్యూలల్లో బారులు తీరారు.


పామర్రు మండలం జుర్రువరంలో ఓటు వేసేందుకు బారులు తీరిన మహిళలు


కపిలేశ్వరపురంలో ఓటు వేసేందుకు వీల్‌చైర్‌లో వస్తున్న దివ్యాంగుడు

గుడివాడరూరల్: గుడివాడ నియోజకవర్గంలో సోమవారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభానికే ముందే ఓటర్లు క్యూలో వేచి ఉన్నారు. నియోజకవర్గంలోని ఏ పోలింగ్ బూత్‌లో చూసినా మహిళలు, వృద్ధులు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఆసక్తి చూపారు. గుడివాడ నియోజకవర్గంలో ఉదయం 11 గంటలకు 21.3 శాతం, పామర్రు నియోజకవర్గంలో 29.65 శాతం పోలింగ్ నమోదైంది. మధ్యాహ్నం మూడు గంటలకు గుడివాడలో 58.60, పామర్రులో 64.51 శాతం పోలింగ్ నమోదైంది. సాయంత్రం నాలుగు గంటలకు గుడివాడలో 64.49, పామర్రులో 72.21 శాతం పోలింగ్ నమోదైంది.

ఎండను సైతం లెక్క చేయకుండా..

గుడివాడ నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. నియోజకవర్గంలోని గుడివాడ అర్బన్, రూరల్, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల్లో ఉదయం ఏడు గంటల నుంచే పోలింగ్ కేంద్రాల వద్దకు ప్రజలు చేరుకున్నారు. ఉదయం 7గంటల మొదలైన పోలింగ్ కొన్ని గ్రామాల్లో సాయంత్రం 7.30 గంటలకు వరకు కొనసాగింది. ఎన్నికల నిబంధనల మేరకు గంట ముందు క్యూలో నిలబడిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా ఎన్నికల అధికారులు చర్యలు చేపట్టారు. ఎండను సైతం లెక్క చేయకుండా యువత, మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు భారీగా తరలివచ్చారు. నియోజకవర్గంలోని సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాల్లో పోలీసులు, కేంద్ర బలగాలతో కట్టుదిట్టమైన బందోబస్తును డీఎస్పీ పి.శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

పామర్రులో..

పామర్రు: పామర్రు నియోజకవర్గంలో సోమవారం నిర్వహించిన ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. మండలంలోని 55 బూత్‌లలో ఉదయం ఏడు గంటల నుంచి పోలింగ్ ప్రారంభించారు. కొన్ని చోట్ల ఈవీఎంల మొరాయింపుతో పోలింగ్ అర్ధగంట ఆలస్యంగా ప్రారంభించారు. పామర్రులోని 169వ పోలింగ్ బూత్ వద్ద ఏర్పాటు చేసిన టెంట్ చాలక పోవడంతో ఓటర్ల ఎండలో క్యూలో ఉండి ఎక్కువ సేపు ఓటు కోసం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

రిమ్మనపూడిలో టీడీపీ శ్రేణుల దొంగ ఓట్లు

పామర్రు మండలం రిమ్మనపూడిలోని పోలింగ్ బూత్ వద్ద టీడీపీ శ్రేణులు దొంగ ఓట్లు వేసేందుకు ప్రయత్నించారు. వీరిని పోలింగ్ ఆఫీసర్ గుర్తించి పోలీసులకు అప్పజెప్పారు. జుర్రువరం పోలింగ్ బూత్ వద్ద టీడీపీ శ్రేణులు స్థానిక పోలీసులతో బూత్‌లోకి వెళ్లామంటూ గొడవకు దిగారు. పోలీస్ అధికారి చొరవతో గొడవ సద్దుమణిగింది.

ముదినేపల్లి రూరల్‌లో..

ముదినేపల్లి రూరల్: మండలంలో పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం ఏడు గంటలకే పోలింగ్ ప్రారంభం కాగా ఓటు వేసేందుకు ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వెల్లువలా తరలివచ్చారు. పోలింగ్ కేంద్రాల క్యూ లైన్లన్నీ ఓటర్లతో కిటకిటలాడాయి. సమయానికే పోలింగ్ ప్రారంభించినప్పటికీ రద్దీ కారణంగా ఓటు వేసేందుకు గంటల కొద్దీ క్యూలలో వేచి ఉండాల్సి వచ్చింది. ఉదయం 10 గంటల తరువాత భానుడు ప్రతాపం చూపడంతో కేంద్రాలకు ఓటర్ల రావడం తగ్గింది. మధ్యాహ్నం రెండు నుంచి 3గంటల సమయంలో పలు పోలింగ్ కేంద్రాలు ఓటర్లు లేక ఖాళీగా దర్శనమిచ్చాయి. సాయంత్రం 4గంటల సమయంలో వాతావరణం చల్లబడి మబ్బులు రాకతో ఓటు వేసేందుకు ఓటర్లు ఒక్కసారిగా బయటకు వచ్చారు. దీంతో క్యూలన్నీ ఓటర్లతో కిటకిటలాడాయి. పోలింగ్ సాయంత్రం 6 గంటలతో ముగియాల్సి ఉన్నప్పటికీ క్యూలో వేచి ఉన్న అందరికీ ఓటు వేసేందుకు అధికారులు అవకాశం కల్పించారు. వడాలి జెడ్పీ హైస్కూల్లో సాయంత్రం ఆరు గంటలకు పోలింగ్ కేంద్రం ఓటర్లతో కిటకిటలాడింది.

తోట్లవల్లూరులో..


మొదటిసారి ఓటు వేసిన విద్యార్థిని

తోట్లవల్లూరు: మండల వ్యాప్తంగా 38 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును సోమవారం వినియోగించుకున్నారు. తోట్లవల్లూరు, భద్రిరాజుపాలెం, బొడ్డపాడు గ్రామాల్లోని పలు పోలింగ్ కేంద్రాలలో ఈవీఎంలు మొరాయించటంతో కొద్దిసేపు పోలింగ్ నిలిచిపోయింది. పాములలంకలో రాత్రి పొద్దుపోయే వరకు పోలింగ్ కొనసాగింది. పలుచోట్ల టీడీపీ కార్యకర్తలు కవ్వింపు చర్యలకు పాల్పడినప్పటికీ వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సంయమనం పాటించారు. తహసీల్దార్ కుసుమకుమారి, డీఎస్పీ కృష్ణమోహన్, రిజర్వు ఇన్‌స్పెక్టర్ రవికుమార్, తోట్లవల్లూరు ఎస్ఐ విశ్వనాథ్ పోలింగ్ బందోబస్తును పర్యవేక్షించారు.

మొవ్వలో..

మొవ్వ: మండలంలోని 21 గ్రామాల్లోని 54 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ పూర్తయింది. ఉదయం ఏడు గంటలకే తమ ఓటు హక్కుని వినియోగించుకునేందుకు ఓటర్లు పెద్దెత్తున తరలి రావటంతో పోలింగ్ కేంద్రాలు కిటకిటలాడాయి. జోరు వానను సైతం లెక్కచేయని ఓటర్లు మొవ్వ మండలంలోని మొవ్వ, మొవ్వ పాలెం, వేములమడ, కోసూరు తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం నుంచి జోరు వాన కురిసినప్పటికీ ఓటర్లు లెక్కచేయకుండా పోలింగ్ కేంద్రాలకు చేరుకుని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ రోజు వాన రావటం శుభదాయకమని వైఎస్సార్ పాలన కొనసాగుతుందనటానికి ఇదే నిదర్శనమని పలువురు ఓటర్లు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. మొవ్వ, వేములమడ, మొవ్వ, గూడపాడు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పామర్రు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కై లే అనిల్‌కుమార్ పరిశీలించారు. వృద్ధులకు, వికలాంగులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు.

–మొరాయించిన ఈవీఎంలు

మొవ్వ మండలం మొవ్వపాలెంలోని 217 పోలింగ్ కేంద్రంలోని ఎంపీ అభ్యర్థికి సంబంధించిన ఈవీఎం తొమ్మిది ఓట్లు వేసిన తరువాత మొరాయించడంతో సుమారు గంటన్నర మేర పోలింగ్‌కు అంతరాయం ఏర్పడింది. సెక్టార్ అధికారి శ్యామల ఆధ్వర్యంలో మరో ఈవీఎంను ఏర్పాటు చేశారు. అదేవిధంగా వేములమడలో 221 కేంద్రంతో పాటు కోసూరులోని 223, 227 కేంద్రాల్లో సైతం ఈవీఎంలు మొరాయించాయి.

జోరుగా 'ఫ్యాన్' గాలి

గుడ్లవల్లేరు: మండుటెండల్ని సైతం లెక్క చేయకుండా 'ఫ్యాన్' గాలి వైపు ఓటర్లు పరుగులు తీశారు. గుడ్లవల్లేరు మండలంలో సార్వత్రిక ఎన్నికల పోరు సోమవారం జోరుగా సాగింది. బాలింతలు, గర్భిణులు సైతం ఓటు హక్కును వినియోగించుకున్నారు. వృద్ధాప్యం, దివ్యాంగత్వం ఓటర్లకు అడ్డురాలేదు.

పెదపారుపూడిలో..

పెదపారుపూడి: మండలంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికలు ఎటు వంటి గొడవలు జరకుండా ప్రశాంతంగా జరిగాయి. వెంట్రప్రగడ, పెదపారుపూడి, వానపాముల, భూషణగుళ్ల తదితర గ్రామాల్లో ఉదయం నుంచే ఓటు వేసేందకు కూలలో బారులు తీరారు. వానపాముల గ్రామంలో టీడీపీ, వైఎస్సార్ సీపీ వృద్ధురాలిను లోపలికి తీసుకుని వెళ్లే విషయంలో రెండు వర్గాల మధ్య కొంత వాగ్వాదం జరిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు వచ్చి గొడవ సద్దుమణిగించారు.

85 శాతం పోలింగ్ నమోదు

పమిడిముక్కల: మండలంలో 85 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్దకు ఓటర్లు బారులు తీరారు. వైఎసస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కైలే అనిల్‌కుమార్ మేడూరు బూత్‌కు వెళ్లి పోలింగ్ సరళిని పరిశీలించారు. మేడూరులో ఓటు వేసేందుకు వచ్చిన ఓ మహిళ అస్వస్థతకు గురికావడంతో వైద్య సిబ్బంది చికిత్స చేసి ఓటు వేసేందుకు తీసుకెళ్లారు. సీఐ కిషోర్‌బాబు, ఎస్ఐ శ్రీనివాస్ బందోబస్తు నిర్వహించారు.


పమిడిముక్కల మండలం మేడూరులో ఓటింగ్ సరళిని పరిశీలించేందుకు వెళుతున్న కైలే అనిల్‌కుమార్


పమిడిముక్కల పోలింగ్ బూత్‌లో బారులు తీరిన మహిళా ఓటర్లు


పామర్రు అరండాల్‌పేట పోలింగ్ బూత్ వద్ద రోడ్డుపై నిలబడిన ఓటర్లు


మేడూరులో వడదెబ్బకు గురైన మహిళను వీల్‌చైర్‌లో ఓటుకు తీసుకెళుతున్న వైద్య సిబ్బంది

పామర్రులో ఓటేసిన ప్రముఖులు

పామర్రు: స్థానిక ఆరండాల్‌పేటలోని పోలింగ్ బూత్‌లో పామర్రు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కై లే అనిల్‌కుమార్ తమ ఓటు హక్కును కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి వినియోగించుకున్నారు. స్థానిక అసిసీ పాఠశాలల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వర్ల కుమార్ రాజా తన కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి ఓటు వేశారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డీవై దాసు తన ఓటును స్థానిక మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో వినియోగించుకున్నారు. పామర్రు మాజీ ఎమ్మెల్యే ఉప్పులేటి కల్పన కూడా అసిసీ స్కూలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో తన ఓటును వేశారు.

ప్రశాంతం

గుడివాడ టౌన్: గుడివాడ నియోజకవర్గం, మచిలీపట్నం పార్లమెంట్ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు పోలింగ్ సమయం ముగిసే సమయానికి 75.40 శాతం ఓట్లు నమోదయ్యాయి. ఏ ఒక్క పోలింగ్ కేంద్రంలోనూ ఘర్షణలు, తోపులాటలకు తావు లేకుండా ఎన్నికలు ముగియడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.


మొవ్వలో ఓటు వేసేందుకు వచ్చిన వృద్ధురాలు


మొవ్వ మండలం వేములమడలో బారులు తీరిన ఓటర్లు


తోట్లవల్లూరు మండలం దేవరపల్లిలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు


గుడ్లవల్లేరులో ఓటు హక్కు వినియోగానికి బారులు తీరిన ఓటర్లు


ముదినేపల్లి జెడ్పీ హైస్కూల్లో ఉదయం ఏడు గంటలకే క్యూలో ఓటర్లు

ప్రశాంతంగా ముగిసిన ఎన్నికల సమరం

స్వగ్రామాల్లో ఓటు హక్కు వినియోగించుకున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు


తామరకొల్లులో సాయంత్రం 6 గంటల తర్వాత ఓటు కోసం వేచిచూస్తున్న ఓటర్లు


ఆచవరంలో పోలింగ్ బూత్ వద్ద టెంట్లు సరిపోకపోవడంతో ఎండలో ఓటర్లు

కైకలూరు: నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల సమరం సోమవారం చిన్న చిన్న ఘర్షణలు మినహా ప్రశాంతంగా ముగిసింది. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 110 గ్రామాల్లో 235 పోలింగు బూత్‌ను ఏర్పాటు చేశారు. ఉదయం 6.30 గంటల నుంచే ఓట్లు వేయడానికి ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. మధ్యాహ్నం సమయంలో ఎండ కారణంగా ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు రావడానికి వెనుకంజ వేశారు. సాయంత్రం వాతావరణం చల్లబడటంతో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు తరలివచ్చారు.

పోలింగ్ సరళి..

ఉదయం నుంచి పోలింగ్ సరళిని పరిశీలిస్తే మొత్తం నియోజకవర్గంలో 2,05,604 ఓటర్లకు ఉదయం 9 గంటలకు 18,713 (9.10 శాతం), 11 గంటలకు 49,608 (24.13 శాతం), మధ్యాహ్నం 1 గంటకు 81,597 (39.69 శాతం), 3 గంటలకు 1,26,918 (61.73 శాతం), 5 గంటలకు 1,51,699 (73.78 శాతం), సాయంత్రం 6 గంటలకు 1,61,464 (78.53 శాతం) పోలింగ్ నమోదైంది. అనేక పోలింగ్ కేంద్రాల్లో సాయంత్రం 6 గంటలకు క్యూలో ఉన్నవారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. సాయంత్రం 7 గంటలు దాటిన తర్వాత కూడా ఓటింగ్ కొనసాగింది. నడవ లేని వృద్ధులకు వీల్ చైర్ సౌకర్యం కల్పించారు. తామరకొల్లు జెడ్పీ హైస్కూల్ పోలింగ్ బూత్‌లలో ఆలస్యంగా ఓటింగ్ జరిగింది. గంటల తరబడి ఓటర్లు వేచి ఉన్నారు. జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఓటు వినియోగించుకున్న ప్రజాప్రతినిధులు

ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) కైకలూరు ఓరియంటల్ స్కూల్లో భార్య వీరాకుమారి, కుమారుడు శ్యామ్ ఫణికుమార్ ఓట్లు వేశారు. బీజేపీ అభ్యర్థి కామినేని శ్రీనివాస్ స్వగ్రామం వరహాపట్నంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ స్వగ్రామం కొట్టాడలో ఓటు వేశారు. కాంగ్రెస్ అభ్యర్థి బొడ్డు నోబుల్ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

చెదురుమొదురు ఘర్షణలు

కైకలూరు పెద్ద మసీదు సెంటర్ ఎంపీ యూపీ స్కూల్ వద్ద పలు పర్యాయాలు ఘర్షణ వాతావరణం కొనసాగింది. స్వయంగా ఎమ్మెల్యే డీఎన్నార్ రెండు గంటలు బైఠాయించే పరిస్థితి వచ్చింది. స్కూల్ ఎదురుగా కూటమికు చెందిన కొందరు ఓటర్లకు అల్పాహారం అందించి ఓట్లు వేయాలని అభ్యర్థిస్తున్నారు. అది గమనించిన ఎమ్మెల్యే డీఎన్నార్ రహదారి సమీపంలో బైఠాయించి నిరసన తెలిపారు. ఎట్టకేలకు టెంటును తొలగించారు. బీజేపీ అభ్యర్థి కామినేని శ్రీనివాస్ తన అనుచరులతో కలిసి ఇదే పోలింగ్ బూత్‌ను పరిశీలించడానికి వెళ్లారు. అంతమందిని ఎందుకు పంపించారని ఎమ్మెల్యే డీఎన్నార్ సైతం లోపలికి వెళ్లి అధికారులను ప్రశ్నించారు. చివరకు అందరినీ బయటకు వెళ్లాలని అధికారులు చెప్పారు. కైకలూరు వెలంపేట బూత్‌లో సైతం ఘర్షణ వాతావరణం చోటుచేసుకోవడంతో పోలీసులు అక్కడికి వచ్చి ఇరు పక్షాలను నియంత్రించారు. నియోజకవర్గ వ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది.